# వీళ్ళింతే....

బి.వి.భద్రగిరీష్

"రాముా పిల్లలనందరినీ రెడీ చేశావా ?"

"చేస్తున్నాను సార్"

"ఇంకా ఎంతమంది ఉన్నారు ? "

"ఇంకా ఇరవై మంది దాకా ఉన్నారు."


ఎంతసేపు.. నీకు చెప్పి కూడా గంట సేపయింది కదా!"

"నిజమే సార్.. కానీ అన్ని పనులూ ఒక్కడినే చూసుకోవాలి కదా. ఇప్పటివరకూ టిఫిన్లు రెడీ చెయ్యడంతోనే సరిపోయింది. అన్ని పనులూ నేను ఒక్కడినే చూసుకోలేక చస్తున్నాను. తోడుగా ఒక ఆయాని తీసుకోమంటే వినరు." రాము గొణగడం ఆరంభించాడు.

"ఆయాని తీసుకురావొచ్చు కానీ జీతం ఎవడిస్తాడు, సరేలే .. ఇది మనిద్దరికీ రోజూ ఉండే గొడవలే కానీ, త్వరగా పిల్లలని రెడీ చెయ్యి. అవతల రావు గారి ఫ్యామిలీ వచ్చే వేళవుతోంది.." అంటూ నేను ఇవతలకొచ్చాను.

మా ఇద్దరి సంభాణకి నేపథ్యం ఇది..


ఒక స్వచ్ఛంద సంస్థ నడిపే అనాథ శరణాలయానికి నేను మేనేజరుని. నాకు సహాయకునిగా రాముా. అనాథ పిల్లలని చేరదీసి పదో తరగతిదాకా చదివించి పంపడం మా శరణాలయం ముఖ్యోద్దేశం. నిధులలేమి ఉన్న సంస్థలకుండే సమస్యలన్నీ మా శరణాలయానికి ఉన్నాయి. నేను దీనికి మేనేజరుగా చేరిన కొత్తల్లో ఇది బాగానే నడిచేది. స్వచ్ఛంద సంస్థను స్థాపించిన పెద్దాయన తన ఆస్థులను సంస్థపరం చేశాడు. ఆయన బతికున్న కాలంలో స్వచ్ఛంద సంస్థలన్నింటికీ నిధుల కొరత ఉండేది కాదు. ఆయన మరణం తర్వాత, వారసులకు ఆయనంత పెద్ద మనసు లేకపోయింది. సంస్థ ఆస్థులపై వారి కళ్ళు పడ్డాయి. ఫలితం ఆస్థులన్నీ కోర్టు కేసుల్లో చిక్కుకున్నాయి. మా శరణాలయానికి డబ్బు కొరత మొదలైంది. ప్రస్తుతం ఉన్న కొద్దిపాటి డిపాజిట్లపై వడ్డీతో, ఇంకా ఎవరన్నా దాతలు అడపాదడపా ఇచ్చే విరాళాలతో శరణాలయం నడుస్తోంది. పిల్లలకు తిండి లోటు లేకుండా చూస్తున్నా, అన్ని ఖర్చులూ భరించి చదువు చెప్పించడం రోజు రోజుకూ భారంగా మారుతోంది. పిల్లల బాగోగులు



చూడటానికి ఇంతకుముందు ఉండే సిబ్బంది కూడా తగ్గిపోయారు. ఇప్పటికి నేనూ, రామూ ఇద్దరమే మిగిలాం.

ఇక రామూను గురించి.. అతడు కూడా అనాథే. ఇదే శరణాలయంలో పెరిగాడు. శరణాలయంలోని పిల్లలంటే ఉండే అభిమానంతో బయటకు వెళ్ళకుండా ఇక్కడే నాకు సహాయకుడుగా కుదురుకున్నాడు. తిండీ, గూడు, బట్టా గడుస్తాయి. ప్రత్యేకంగా ఇచ్చే జీతమేమీ లేదు. ఐనా పిల్లల పనులన్నీ అభిమానంతో చేస్తాడు. పనెక్కువైనప్పుడు సణగడం కద్దు. పెద్దగా చదువుకోకపోయినా మంచి తెలివైనవాడు. న్యూస్ పేపరును పొల్లుపోకుండా చదువుతాడు. వాడి తెలివితేటలు, విషయపరిజ్ఞానం, విశ్లేషణా చూసి అప్పుడప్పుడు నాకే ఆశ్చర్యం వేస్తూ ఉంటుంది.

ఇలా ఉండగా , ఒకరోజు "రావ్ ఇండస్ట్రీస్" ఆఫీసు నుంచి నాకు కబురొచ్చింది. నేను ఆశ్చర్యపోయాను. రావ్ ఇండస్ట్రీస్ అధినేత రావుగారు ఈ వూరి అత్యంత ధనికుల్లో ఒకరు. అలాంటివారికి నాలాంటి సామాన్యుడితో పనేముంటుంది ? వెళ్ళి వారి పియ్యేని కలిశాను. ఆయన మాటల సారాంశమేమంటే, రావుగారి మనవడి పుట్టినరోజు వచ్చేవారం ఉంది. ఈ సారి తన మనవడి పుట్టినరోజును అనాథ పిల్లల మధ్య జరపాలని రావుగారు, నిజం చెప్పాలంటే రావుగారి శ్రీమతి నిర్ణయించారు. అందుకు వారు మా అనాథ శరణాలయాన్ని ఎంచుకున్నారు. బాబు పుట్టినరోజునాడు శరణాలయంలోని పిల్లలందరినీ శుభ్రంగా తయారుచేసి ఉంచమని హుకుం జారీ చేయడానికి రావుగారి పియ్యే నన్ను పిలిచాడు. నేను అంగీకారం తెలిపి, సంతోషం నిండిన మనస్సుతో బయటికొచ్చాను. రావుగారి వంటి ధనికుడు మా శరణాలయానికి రావాలనుకోవడం నిజంగా మాపిల్లల అదృష్టమే! ఈ సందర్భంగా రావుగారిని విరాళం అడగవచ్చు లేదా కొంతమంది పిల్లల చదువు భారం వహించమని కోరవచ్చు. కోటీశ్వరుడైన ఆయనకు అదో లెక్కలోది కాబోదు. ఇలా ఊహల్లో తేలుతూ, నేను శరణాలయానికి వచ్చి రామూకు విషయాన్ని చెప్పాను. అతడు పెద్దగా సంతోషించినట్టు కనబడలేదు. నేనదేం పట్టించుకోకుండా, పనుల్లో పడ్డాను.



ఇక వర్తమానానికి వస్తే..

నాకూ రామూకు మధ్య సంభాషణ రావుగారి పుట్టినరోజు సందర్భంగా జరిగిందే. అలా ఇద్దరం ఒకరినొకరు అదిలించుకుంటూ మొత్తానికి, రావుగారి కుటుంబం వచ్చే వేళకు, పిల్లలను తయారు చేశాం. నేను స్వంత డబ్బు కొంత ఖర్చు పెట్టి కొన్ని ఇతర ఏర్పాట్లు చేశాను. కుర్చీలు, షామియానా, రంగు కాయితాలు, వెల్‌కమ్ బోర్డు వగైరా. పిల్లలందరినీ వరుసలో కూర్చోబెట్టి రావుగారి కోసం ఎదురు చూడసాగాం. పదినిముషాలు దాటిన తర్వాత దుమ్ము రేపుకుంటూ, పదికార్లు శరణాలయం గేటు ముందు ఆగాయి. వాటిలోంచి రావుగారు, ఆయన శ్రీమతి, మనవడు, ఇతర బంధువులు, పియ్యే, నౌకర్లు దిగారు. పిల్లవాడు రబ్బరు బొమ్మలా ఉన్నాడు. ఏడేళ్ళుంటాయనుకున్నాను. నిజమేననీ, ఏడో బర్త్ డే అనీ పియ్యే తరవాత నాతో అన్నాడు.

నౌకర్లు కేకు, స్వీటు పాకెట్లు ఇతరత్రా సామాన్లు కారులోంచి కిందకు దించారు. నేను మర్యాదగా వారిని ఆహ్వానించి, కుర్చీల్లో కూర్చో బెట్టాను. కార్యక్రమం మొదలైంది. కాసేపటికి, నాకేదో అపశ్రుతి తోచసాగింది. కార్యక్రమం అంతా రావుగారి శ్రీమతి ఆధ్వర్యంలో జరుగుతోంది. ఆవిడ పిల్లవాడిని ఎవరి దగ్గరకూ వెళ్ళనివ్వడం లేదు. అలా అని, తానూ పెద్దగా దగ్గరికి తీయడంలేదు. వాడు ఎక్కువగా ఆయా దగ్గరే ఉంటున్నాడు. పిల్లవాడి తల్లిదండ్రులు, అంటే రావుగారి కొడుకు, కోడలు అమెరికాలో ఉన్నారట. ఈసారికి తాత దగ్గర పుట్టినరోజు జరుపుకోవడానికి పిల్లవాడు ఇక్కడికి వచ్చాడట. మాటల్లో పియ్యే చెప్పాడు. అలాగే అక్కడున్న వారెవరూ, శరణాలయం పిల్లలతో కలిసే ప్రయత్నం చేయడంలేదు. కలవడం మాట దేవుడెరుగు.. కనీసం మాట్లాడడం కూడా చేయడంలేదు. ఒక్క పియ్యే తప్ప నాతో కూడా మాట్లాడటానికి ఎవరూ ఆసక్తి చూపించలేదు. పియ్యే కూడా నాతో అవసరానికి మించి ఒక్క మాట మాట్లాడలేదు. నేను తెలుసుకున్న వివరాలన్నీ కుతూహలం కొద్దీ అతడిని అడిగి తెలుసుకున్నవే. అందరూ వాళ్ళలో వాళ్ళు మాట్లాడుకుంటున్నారు తప్ప ఇంకొక వైపు చూడటం లేదు. మా పిల్లలంతా బిక్కమొహాలేసుకుని కూర్చొన్నారు. పిల్లల్లో ఒకరిద్దరి గొంతు బావుటుంది. అందుకని వారిచేత "హ్యాపీ బర్త్ డే టూ యూ" పాటను ప్రాక్టీసు చేయించాను. కానీ వారికి ఆ అవసరం లేకుండా, కారులోంచి సీడీ ప్లేయరుని తెప్పించింది శ్రీమతి రావుగారు. అందులోనుంచి హ్యాపీ బర్త్ డే టూ యూ పాటను ప్లే చేశారు. నా మనసులో మెదులుతున్న భావాలను పంచుకుందామంటే రామూ కనబడలేదు. ఎక్కడికి పోయాడో ఏమిటో ? రావుగారి మనవడు కేకు కట్ చేశాడు. వెంటనే నౌకర్లంతా కల్పించుకుని కేకును ముక్కలుగా కోసి, ప్లేట్లలో పెట్టి పిల్లలకు పంచారు. చాక్లెట్లు, బిస్కెట్లు ఇచ్చారు. పంచడం అయిపోయిన వెంటనే బయలుదేరడానికి సిద్ధపడ్డారు. నాకు స్ఫురించింది.. రావుగారిని ఏదైనా సహాయం కోరడానికి ఇదే సమయం! వెంటనే పియ్యే దగ్గరకు వెళ్ళాను. అతడు పెద్ద గొంతుతో అందరికీ పనులు పురమాయిస్తున్నాడు. రావుగారితో ఐదు నిముషాలు మాట్లాడే అవకాశం ఇప్పించమని అడిగాను. అతడు నావంక ఎగాదిగా చూశాడు. ఏమనుకున్నాడో ఏమో, రావుగారి దగ్గరకు వెళ్ళి మాట్లాడి తిరిగి వచ్చి , నన్ను వెళ్ళమని సైగ చేసి, తిరిగి పనులు పురమాయించడం మొదలు పెట్టాడు.

నేను కుర్చీలో కూర్చొని ఉన్న రావుగారి దగ్గరకు వెళ్ళాను. ఆయన పక్కన కూర్చొని ఉన్న తన శ్రీమతితో ఏదో మాట్లాడుతున్నాడు. నన్ను చూసి ఏమిటన్నట్టు కనుబొమలెగరేశాడు. నేను వినయంగా నమస్కారం చేసి క్లుప్తంగా శరణాలయం పరిస్థితిని వివరించాను. ఎంతో కొంత ఆర్థికసాయం చేయమనీ, లేదా పిల్లల చదువులకయ్యే ఖర్చు భరించమనీ అభ్యర్థించాను. రావుగారు తలపంకించాడు కానీ ఏమీ మాట్లాడలేదు.

ఆయన శ్రీమతి కల్పించుకుంది. "అమెరికాలో మా మనవడి ఫ్రెండు తన పుట్టినరోజును అర్ఫనేజీలో జరుపుకున్నాట్ట. అప్పటినుంచీ, తన బర్త్ డే కూడా అనాథ శరణాలయంలో జరుపుకోవాలని వీడు ఒకటే గోల. సర్లే, ఊర్లో మనకు కూడా ప్రిస్టేజీగా ఉండి మంచి పేరు వస్తుందని ఇక్కడికి తీసుకొచ్చాం! లేకపోతే ఇక్కడ బర్త్ డే జరుపుకోవాల్సిన ఖర్మ వీడికేమిటి ? దానికితోడు ఎవరో కనిపడేసిన ఈ అలగా జనాన్నంతా పోషించాలా! మేము కష్టపడి సంపాదించడం, మీరంతా ఇలా విరాళాలమీద పడటం, వీళ్ళంతా చదువుకుంటే రేపు పనులు చేసేదెవడు ? పదండి పోదాం!" రావుగారిని అదిలిస్తూ ఆవిడ లేచింది. నేను హతాశుణ్ణై ఆయన వంక చూశాను. ఆయన తన తలను అర్థమయ్యీ కాని రీతిలో ఊపుతూ లేచాడు.

వాళ్ళకు వీడ్కోలు చెప్పాలన్న ధ్యాస కూడా లేకపోయింది నాకు. చూస్తూ నిలబడ్డాను. పది నిముషాల్లో ఆవరణ ఖాళీ అయింది. మా పిల్లలంతా గోల గోలగా అరుచుకుంటూ రూములవైపు వెళుతున్నారు. ఎక్కడ నుంచి వచ్చాడో రామూ నా ఎదురుగా నిలబడి ఓదార్పుగా నవ్వాడు. అతడితో ఏదో చెప్పబోయాను. "నేను అంతా విన్నాను సార్! వీళ్ళింతే... నిజంగా అనాథలమీద ప్రేమ ఉండి కాదు ఇక్కడికి వచ్చేది. తమ డాబు దర్పం చూపించుకోవడానికి. ఇక్కడ పుట్టినరోజు జరుపుకోవడం ఒక ప్రిస్టేజీ ... ఫ్యాషన్. అందరిలో తాను మంచివాణ్ణనిపించుకోవడానికి. నిజంగా సహాయం చేయదల్చుకున్నవాడికి ఇవన్నీ అవసరమా ? వీళ్ళు పెట్టే ఖర్చు ఒక పిల్లవాడి చదువుకు పనికి వస్తుంది. వీళ్ళింతే సార్... లేనివాడు పైకి రావడం వీళ్ళకి ఏనాటికీ ఇష్టం ఉండదు. తమదెప్పుడూ ఇచ్చే చెయ్యిగానే ఉండాలని వాళ్ళ కోరిక .." రామూ ఏదో చెపుతూనే ఉన్నాడు. అతడి మాటల్లో సత్యాన్ని అంగీకరిస్తూ నేను స్తబ్దుగా ఉండిపోయాను.

✻